

27న చంద్రబాబు పర్యటన

శ్రీకాకుళం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 27న జిల్లాలో పర్యటించనున్నారు. రా కదలిరా సభలో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు శ్రీకాకుళంలో సభా ప్రాంగణం, ఇతరత్రా ఏర్పాట్ల పర్యవేక్షణకు పార్టీ నాయకులు శ్రీకారం చుట్టారు. గత మూడు నెలల నుంచి చంద్రబాబు పర్యటన జిల్లాలో వాయిదా పడుతూ వస్తోంది. ఎట్టకేలకు పర్యటన ఖరారైంది. ఎన్నికల ముందు సభ కావడంతో భారీగా నిర్వహించేందుకు టీడీపీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి.

వంశధారపై నిర్లక్ష్యం

- ఆధునికీకరణకు నోచుకోని ఎడమ ప్రధాన కాలువ
- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ప్రతిపాదనలు పంపిస్తే కొర్రీలు
- శివారు భూములకు అందని సాగునీరు
- నష్టపోతున్న రైతాంగం



టెక్కలి సమీపంలో వంశధార ప్రధాన ఎడమ కాలువ

తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ జిల్లాలో వంశధార ఎడమ ప్రధాన కాలువను తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. ఐదేళ్లుగా కాలువ నిర్వహణను పట్టించుకోవడం లేదు. ఆధునికీకరణ ఊసే ఎత్తడం లేదు. ప్రతిపాదనలు పంపిస్తే నిధులు మంజూరు చేయకుండా ఏదో ఒక కొర్రీతో వెనక్కి పంపించేస్తోంది. ఫలితంగా కాలువ రూపురేఖలు కోల్పోగా శివారు భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

(టెక్కలి/పలాస)

వంశధార కాలువ వచ్చిందన్న సంతోషం టెక్కలి, పలాస నియోజకవర్గ రైతులకు ఎప్పుడూ లేదు. ఎడమ కాలువ నిర్మించిన తరువాత వరుసగా ఐదేళ్లపాటు సక్రమంగా పంట పొలాలకు నీరు అందేది. తరువాత నిర్వహణ లేకపోవడంతో కాలువ అంతా కుచించుకుపోయింది. దీంతో ఏటా శివారు ప్రాంత రైతాంగానికి సాగునీటి కష్టాలు తప్పడం లేదు. రెండు దశాబ్దాలుగా కాలువల్లో పూర్తిస్థాయిలో పూడికలు తొలగించకపోవడం, కాలువ లైనింగ్ పనులు జరిపించకపోవడం, పిచ్చిమొక్కలు, రాళ్లు, నాచు, గుర్రపుడెక్క వంటివి తొలగించకపోవడంతో ప్రస్తుతం వంశధార ప్రధాన ఎడమకాలువ స్వరూపమే మారిపోయింది. వంశధార ప్రధాన ఎడమ కాలువను 1977లో రూ.109కోట్ల అంచనా వ్యయంతో తవ్వారు. ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం, టెక్కలి, పలాస నియోజకవర్గాల పరిధిలో ఉన్న ఈ కాలువ పొడవు 104.826 కిలోమీటర్లు. 450 వరకు ప్రధాన, ఉప, పంట కాలువలు ఉన్నాయి. వీటి ద్వారా 12 మండలాల పరిధిలోని 398 గ్రామాల్లో గల లక్ష48వేల23 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే, హిరమండలంలోని గొట్టా బ్యారేజికి భారీ స్థాయిలో వరదలు వస్తేనే ఈ కాలువ ద్వారా శివారు ప్రాంతాలకు సాగునీరు అందుతుంది. లేదంటే ఆ ఏడాది దుర్భిక్షాన్ని రైతులు అనుభవించాల్సిందే. 2,480 క్యూసెక్కుల సాగునీరు కాలువ వెంబడి వెళ్లాల్సి ఉండగా టెక్కలి ప్రాంతానికి వచ్చేసరికి కనీసం 500 క్యూసెక్కుల నీరు కూడా రాని పరిస్థితి నెలకొంది. ప్రధాన, ఉప, పంట కాలువలు సుమారుగా 450 వరకు ఎల్ఎంసీలో ఉన్నా ఏటా రైతులకు సాగునీటి కష్టాలు గట్టెక్కడం లేదు. ఓవైపు కాలువలు వెంబడి లీకేజీలు, మరోవైపు శిథిలమైన షట్టర్లు, మరమ్మతులకు నోచుకోని ఆఫ్‌టేక్‌లు, అండర్ టర్నల్స్ తదితర సమస్యలు మూలంగా శివారు భూములకు సాగునీరు అందడం లేదు.



పలాస: జగన్నాథసాగరం చెరువులోకి వంశధార నీరు ప్రవహించే ప్రాంతం



పలాస:ఈదురాపల్లి వద్ద మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్న వంశధార కాలువ

ప్రతిపాదనలు పంపించాం..

వంశధార ప్రధాన ఎడమ కాలువ ఆధునికీకరణకు రూ.970కోట్లతో ప్రతిపాదనలు చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇరిగేషన్‌కు ఫైల్ పంపించాం. ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఈ ఫైల్ ఉంది.

-కె.శ్రీకాంత్, వంశధార ఈఈ

వర్షం పడితేనే నీరు..

పలాస నియోజకవర్గంలో వంశధార కాలువ ద్వారా సుమారు 9 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. పలాస మండలం టెక్కలిపట్నం, నందిగాం మండలం మీదుగా వంశధార కాలువ ప్రవేశించి వజ్రపుకొత్తూరు మండలం కిడిసింగి వరకు సుమారు 18 కిలోమీటర్లు ప్రవహించి శివారు భూములకు నీరు అందించాల్సి ఉంది. అయితే, 17 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దిగువస్థాయి వరకు నీరు వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలేవీ వంశధార నీటి కోసం పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తేనే నీరు వస్తుందంటున్నారు. ఆ సమయంలో నీరు వచ్చినా రాకపోయినా ఒక్కటేనని అంటున్నారు. వంశధార కాలువను ఆధునికీకరించాలని, శివారు వరకూ సాగునీరు ఇవ్వాలని వైసీపీ ఎంపిపి ఉంగ ప్రవీణ జడ్పీ సమావేశాల్లో పలుమార్లు ప్రస్తావించినా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ముఖ్యంగా పలాస ప్రాంతంలో దేశబట్టి చానల్-వంశధార కాలువ కలిసే ప్రాంతంలో కాలువ స్వరూపం మారిపోయింది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన మురుగు నీరంతా కాలువలో చేరి వంశధార ప్రవా హానికి అడ్డుకట్ట వేస్తుంది. దీనివల్ల నీరు విడుదలైనా ప్రయో జనం లేకపోతుంది. మురుగునీరు వంశధార కాలువలో కలవడం వల్ల ఆయా ప్రాంతంలో ఉన్న ప్రధాన చెరువులు కలుషిత మవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

- గత ఐదేళ్లుగా వంశధార కాలువ ఆధునికీకరణకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ప్రతిపాదనల వ్యయం రెట్టింపునకు చేరుకుంది. 2014లో అప్పటి అధికారులు రూ.450కోట్లతో కాలువ ఆధునికీకరణకు ప్రతిపాదిస్తే ఇప్పుడు రూ.970కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఇరిగేషన్‌కు స్థానిక వంశధార అధికారులు ఫైలు పంపించడం, కొర్రీలతో వెనక్కు రావడం పరిపాటిగా మారింది. స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు నియోజకవర్గాల పరిధిలో ఈ కాలువ ఉన్నా దశ మాత్రం మారలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆధునికీకరణకు చర్యలు చేపట్టి పూర్తిస్థాయిలో సాగునీటిని అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

గార ఎస్‌బీఐకి బంగారం అప్పగింత

- బ్యాంకు వద్దకు చేరుకున్న బాధితులు



బ్యాంకు బయట బంగారు ఆభరణాల కోసం వేచి ఉన్న బాధితులు

శ్రీకాకుళం క్రైం/గార, ఫిబ్రవరి 21: గార ఎస్‌బీఐలో ఇటీవల మాయమైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని కోర్టు ఉత్తర్వుల మేరకు బ్యాంకు అధికారులకు బుధవారం అప్పగించారు. బంగారు ఆభరణాల మాయం ఘటన గతే డాది నవంబరు 30న వెలుగులోకి వచ్చింది. బాధితుల ఫిర్యాదు మేరకు గార ఎస్‌ఐ కామేశ్వరరావు కేసు నమోదు చేశారు. డీఎస్పీ వై.శృతి నేతృత్వంలో సీఐ ఎల్.సన్యాశి నాయుడు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో 9 మంది నిందితులను పోలీసులు గుర్తించి వారిని అరెస్టు చేశారు. నిందితులు పలు బ్యాంకుల్లో కుదవ పెట్టిన బంగారాన్ని స్వాధీనం చేసుకుని కోర్టుకు అందించారు. ఈ బంగారాన్ని బ్యాంకుకి అప్పగించాలని న్యాయస్థానం బుధవారం పోలీసు శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎస్పీ జీఆర్ రాధిక సూచనల మేరకు శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి కోర్టు నుంచి సేకరించిన బంగారు ఆభరణాలతో బ్యాంకుకు చేరుకున్నారు. 58 మంది ఖాతాదారులకు సంబంధించిన 60 బ్యాగుల్లో ఉన్న బంగారు ఆభరణాలను బ్యాంకు రీజనల్ మేనేజర్ ఎంఎస్ఎన్ రాజుకు అప్పగించారు. పోలీసులు తమ ఆభరణాలను అప్పగిస్తున్నారని తెలుసుకున్న బాధితులు పెద్ద సంఖ్యలో బ్యాంకు వద్దకు చేరుకున్నారు. ఆభరణాలను ఎప్పుడు తమకు అప్పగిస్తారంటూ బ్యాంకు అధికారులతో పాటు పోలీసులను నిలదీశారు. ఆభరణాలు బ్యాంకులో ఉంటా యని, కోర్టు ఉత్తర్వుల మేరకు చట్టపరమైన నిబంధనలతోనే బంగారాన్ని బ్యాంకుకి అప్పగించామని పోలీసులు చెప్పడంతో బాధితులు శాంతించారు.

త్వరలో చార్జిషీట్: డీఎస్పీ..

కోర్టులో కేసు పూర్తయ్యేంత వరకు ఖాతాదారులు తమ బంగారాన్ని అమ్మడం గానీ, కరిగించడానికి గానీ వీలు కాదని డీఎస్పీ శృతి అన్నారు. ఒకవేళ శుభకార్యాల నిమిత్తం ఆభరణాలు కావాలంటే కోర్టుకు అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ఆభరణాలను తీసుకువెళ్లి పని పూర్తయిన తరువాత తిరిగి బ్యాంకులో అప్పగించాలని తెలిపారు. కేసు పూర్తయ్యేంత వరకు ఖాతాదారులు సహకరించాలని కోరారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతుందని, త్వరలో చార్జిషీట్ వేయనున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా, శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్ వద్ద ఉన్న ఓ బ్యాంకు బ్రాంచ్‌లో మ్యూచువల్ ఫండ్ నిధులు గోల్ మాల్ కావడంతో బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఈ నిధులను అక్కడ పని చేసిన సిబ్బంది ఒకరు తన సొంతానికి వాడుకున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆ వ్యక్తి కుటుంబ సభ్యులు ఆ డబ్బులను తిరిగి బాధితులకు చెల్లించే పనిలో పడ్డారు. తమకు పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించేలా చూడాలని బాధితులు బ్యాంకు అధికారులను కోరుతున్నారు.

జర్నలిస్టులపై దాడులు
జగన్ గూండాల పనే

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

టెక్కలి, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో వరుసగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు జగన్ గూండాల పనేనని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజ రాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం కోటబొమ్మాళి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరు లతో మాట్లాడుతూ.. రాప్తాడు సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై, కర్నూలులో 'ఈనాడు' కార్యాలయంపై జరిగిన దాడులు చూస్తుంటే సూత్రధారి, పాత్రధారి జగన్‌రెడ్డేనని అర్థమవుతుందన్నారు. ఈ దాడులను తెలుగుదేశం పార్టీ ఖండిస్తుందన్నారు. 'రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న వరుస దాడుల విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్తాం. ఈ రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ లేదు. దొంగా, పోలీస్ ఒక్కటయ్యారు. పరిపాలించేవాడు, ప్రజాస్వామ్యంలో లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన వారు ఒకటై నాటకాలు ఆడుతున్నారు. రాప్తాడు సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిపై కనీసం స్పందన లేదు. జగన్ గూండాలే దాడులకు పాల్పడుతున్నారు. పోలీసులు తూతూ మంత్రంగా కేసులు నమోదు చేస్తున్నారు. బాధ్యులపై కనీసం చర్యలు తీసుకోవడం లేదు. ఈ ఘటనలపై న్యాయ విచారణ చేపట్టాలి. వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పర్వం భారీ స్థాయిలో ప్రారంభమైంది. అటువంటి వారిని వైసీపీ నాయకులు అనేకరకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఎవరూ భయపడాల్సిన పనిలేదు. వారికి అండగా ఉంటాం. రాష్ట్రంలో 160 స్థానాలు టీడీపీ, జనసేన కూటమి కైవసం చేసుకుంటుంది. వైసీపీ సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతుంది'. అని అచ్చెన్న అన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి



నందిని (ఫైల్)

మెళియాపుట్టి, ఫిబ్రవరి 21: మండలంలోని భరణికోట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఎస్.నందిని అనారోగ్యంతో బుధవారం వేకువ జామున మృతి చెందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాలి నాయుడు తెలిపారు. జక్కరబంద గ్రామానికి చెందిన నందిని ఈ నెల 10న అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు పాఠశాల నుంచి తీసుకెళ్లి పలాసలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్యం కుదుట పడడంతో ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకువచ్చారు. అయితే, బుధవారం వేకువ జామున వాంతి చేసుకొని నందిని మృతి చెందినట్లు హెచ్‌ఎం తెలిపారు. నందిని తల్లిదండ్రులు మృతి చెందటంతో మామయ్య వెంకట్రావ్ సంరక్షణలో ఉంటున్నట్లు గ్రామస్థులు తెలిపారు. విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఏటీడబ్ల్యూవో శ్రీనివాసరావు పాఠశాలలో విచారణ నిర్వహించారు. నివేదికను పీవోకు అందజేయనున్నట్లు తెలిపారు.

విదేశీ ఉద్యోగాల పేరుతో టోకరా

- 92 మంది నుంచి రూ.46లక్షలు వసూలు
- ఒడిశా పోలీసుల అదుపులో వజ్రపుకొత్తూరు వాసి

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 21: విదేశీ ఉద్యోగాల పేరుతో 92 మంది నుంచి డబ్బులు వసూలు చేసి వారికి టోకరా పెట్టాడు ఓ వ్యక్తి. బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం ఆ వ్యక్తిని ఒడిశా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన ఓ వ్యక్తితో పాటు విశాఖపట్నంకు చెందిన ఓ వ్యక్తి, జిల్లాకు చెందిన మరో వ్యక్తి మొత్తం ముగ్గురూ కలిసి విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒడిశా రాష్ట్రం గొల్లంత్ర కేంద్రంగా మోసానికి పాల్పడ్డారు. 92 మంది నిరుద్యోగుల నుంచి రూ.50 వేల చొప్పున మొత్తం రూ.46లక్షలు వసూలు చేశారు. ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు ఒడిశా పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు బుధవారం ముగ్గురు ఏజెంట్లను అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్నారు. కాగా, వజ్రపుకొత్తూరు మండలంలోని పూండి, తదితర ప్రాంతాల్లో ఇలాంటి మోసాలు గతంలో వెలుగుచూశాయి. ఇప్పటికే అనేక మంది ఏజెంట్లను పోలీసులు అదుపులోకి తీసుకొని కొంతమంది బాధితులకు కొంతమేర నగదు అందించారు.

అమ్మకోసం వెళ్లి..

- నేలబావిలో పడి మూడున్నరేళ్ల బాలుడి మృతి
- పాలసింగిలో విషాదం





వర్షిత్ మృతదేహం ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో

టెక్కలి, ఫిబ్రవరి 21: ఆ దంపతులు కూలీ నాలీ చేసుకొని పిల్లలను పోషించుకుంటున్నారు. తండ్రి ఎప్పటిలాగే కూలి పనికి వెళ్లగా.. తల్లి తన మూడున్నరేళ్ల చిన్నారిని స్థానికులకు అప్పగించి ఉపాధి పనికి వెళ్లింది. అయితే కొంతసేపటి తరువాత స్థానికులు ఎవరి పనిలో వారు నిమగ్నమై ఉండగా బాలుడు అమ్మకోసం వెతుక్కుంటూ వెళ్లి నేలబావిలో పడి మృతి చెందాడు. దీంతో మొఖలింగాపురం పంచాయతీ పాలసింగి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పాలసింగి గ్రామానికి చెందిన జన్ని శ్రీనివాస్, సుభద్ర గిరిజన దంపతులకు ఏడో తరగతి చదువుతున్న కుమార్తె సౌజ, మూడున్నరేళ్ల వర్షిత్ అనే కుమారుడు ఉన్నారు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం తండ్రి కూలిపనికి వెళ్లగా తల్లి సుభద్ర గ్రామస్థులతో కలిసి గ్రామ సమీపంలోని పొన్నాలబందలో ఉపాధి పనికి వెళ్లింది. తల్లి సుభద్ర ఉపాధి పనికి వెళ్తూ స్థానికులకు వర్షిత్‌ను అప్పగించి తాను వచ్చే వరకూ చూసుకోవాలని చెప్పింది. అయితే గ్రామంలో కొందరు పిల్లలు ఆడుకుంటుండగా, మరికొందరు ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. వర్షిత్.. తల్లి సుభద్ర ఉపాధి పనికి వెళ్లడాన్ని గమనించి అటువైపుగా వెళ్లాడు. గ్రామంలో ఇతర పిల్లలతో కలిసి ఆడుతున్న వర్షిత్ కనిపించకపోయే సరికి అక్కడ ఉన్న వారంతా బాలుడి కోసం ఆ ప్రాంతంలో వెతకసాగారు. అయినా జాడ కనిపించలేదు. కొంతసేపటి తరువాత ఉపాధి కూలీలు ఇంటికి తిరిగి వస్తూ నేలబావిలో పడిన వర్షిత్‌ను చూసి ఆందోళనకు గురయ్యారు. అప్పటికే వర్షిత్ మృతిచెందడంతో బాలుడి మృతదేహాన్ని గ్రామస్థులు ఒడ్డుకు తీశారు. కుమారుడి మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు జన్ని సుభద్ర, శ్రీనివాస్ కన్నీరుమున్నీరుగా విలపించారు.



రోదిస్తున్న తల్లి సుభద్ర

ప్రాణాలు తీస్తున్న పని ఒత్తిడి!





- టెక్కలి మండలం బూరగాం పంచాయతీ కార్యదర్శి గేదెల గణపతి, ఇటీవల గ్రేడ్-1 కార్యదర్శిగా అనకాపల్లి బదిలీ అయిన పలాసకు చెందిన బొడ్డేపల్లి సుదర్శనరావు రెండురోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే, ఇటీవల సోంపేట మండలం కొర్లాం గ్రామానికి చెందిన కార్యదర్శి వాసుదేవరావు, టెక్కలి మండలం లింగాలవలస కార్యదర్శి నానుపాత్రుని మురళీరావు మృత్యువాతపడ్డారు. తాజాగా బుధవారం సంతబొమ్మాళి మండలం వడ్డితాండ్ర పంచాయతీ కార్యదర్శి గజనీ తులసి అనారోగ్యంతో మృతి చెందింది.



- పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు
- తట్టుకోలేక అనారోగ్యానికి గురవుతున్న వైనం
- రెండు నెలల్లో ఐదుగురి మృతి

(టెక్కలి)

..ఇలా జిల్లాలో రెండు నెలల్లో ఐదుగురు కార్యదర్శులు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. వీరి మరణాలకు ప్రధాన కారణం పని ఒత్తిడేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థలో వీరిపై పని భారం పెరిగింది. గ్రామ పంచాయతీ కార్యదర్శులకు డ్రాయింగ్ అండ్ డిస్పాచింగ్ ఆఫీసర్(డీడీవో) అనే అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఒకప్పుడు పంచాయతీ కార్యదర్శులు ఇంటిపన్నుల వసూళ్లు, పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ, గ్రామ పంచాయతీల సమావేశాలు, పెన్షన్ల పంపిణీ వంటి 54 రకాల విధులకు మాత్రమే పరిమితమయ్యేవారు. అయితే, వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నెలకొల్పి అన్ని బాధ్యతలను కార్యదర్శితో ముడిపెట్టారు. తరచూ మండలస్థాయి అధికా రులు పంచాయతీ కార్యదర్శులతో సమీక్షలు నిర్వహించడం, అలాగే బీఎల్‌వోల విధులు నిర్వహణ, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీ, ఉపప్రణాళికలు తయారీ, స్వమిత్వ సర్వే, పీఎం ఆరోగ్య యోజన కార్డులు పంపిణీ, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, కులగణన, జగనన్న ఆడుదాం ఆంధ్ర పర్యవేక్షణ, జగనన్న సురక్ష, ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమాలు, అలాగే అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, విద్యాకానుక, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, చేదోడు, వైఎస్ఆర్ బీమా, జగనన్న తోడు, జగనన్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్, నేతన్న నేస్తం.. ఇలా అనేకరకాల పనులను కార్యదర్శులకే ముడిపెడుతూ ప్రభుత్వం బాధ్యతలను అప్పగించింది. వీటికి తోడు అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎక్కడ సభలు, సమావేశాలు నిర్వహించినా జనసమీకరణ బాధ్యత కూడా కార్యదర్శులపైనే ఉంటుంది. సచివాలయ సిబ్బందికి, మరోవైపు వలంటీర్లతో ఆయా పనులు చేపట్టాలని ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తూ జాబ్‌చార్ట్‌ను అమలు చేస్తున్నారు. దీంతో తాము తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని, తలకుమించిన భారాన్ని మోయలేక సతమతమవుతున్నామని వాపోతున్నారు. దీంతో కొందరు కార్యదర్శులు సెలవులపై వెళ్తుండగా, మరికొందరు ఉసూరుమంటూ విధులు నిర్వహి స్తున్నారు. తమ జాబ్‌చార్ట్‌లో ఉన్న విధులు కంటే అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సేవల్లో తరించడమే తలనొప్పిగా మారిందని, దీనివల్ల అనారోగ్యానికి గురవుతున్నామని కొందరు కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పనిభారం తగ్గించాలని కోరుతున్నారు.

వడ్డితాండ్ర పంచాయతీ కార్యదర్శి మృతి



తులసి (ఫైల్)

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 21: మండలంలోని వడ్డితాండ్ర పంచాయతీ కార్యదర్శి గజనీ తులసి (37) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. గత పదిహేను రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె విశాఖలో చికిత్స పొందుతున్నారు. అయినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మృతి చెందారు. ఆమెకు భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె మృతిపై ఎంపీడీవో ఉమాసుందరి, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు దుంప శ్రీనివాసరావు, రాజు, డిల్లేశ్వరరావు, తదితరుల సంతాపం తెలిపారు.

సూపర్ సిక్స్‌తో ప్రజా సంక్షేమం

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మేలు చేకూరుతుందని పలువురు టీడీపీ నేతలు అన్నారు. బుధవారం వివిధ గ్రామాల్లో శంఖారావం, బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలతో పాటు మినీ మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కలిగించారు.

వైసీపీని తరిమికొట్టండి: కళా

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 21: రానున్న ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు కోరారు. చినరావుపల్లి, బలిజిపేట గ్రామాల్లో బుధవారం నిర్వహించిన సూపర్ సిక్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వైసీపీ పాలనలో అన్ని రంగాల్లో పూర్తిగా నాశనమయ్యాయని విమర్శించారు. కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెందు మల్లేశ్వరరావు, వావిలపల్లి రామకృష్ణ, నేతలు అన్నెపు భువనేశ్వరరావు, గాలి వెంకటరెడ్డి, గూరు జగపతిబాబు, అల్లుపల్లి రాంబాబు, సంధ్యా గజపతి, గట్టెం శివరామ్, గాడు రామారావు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి 'సూపర్ సిక్స్' దోహదం

నరసన్నపేట: పేదల అభ్యున్నతికి టీడీపీ ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలు దోహద పడతాయని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం ఎన్నికల శంఖారావంలో భాగంగా పట్టణంలో 12వ వార్డులో పర్యటించి ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలో వస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, గొలివి రామారావు, బెవర రాము, ఉణ్న వెంకటేశ్వరరావు, పీస కృష్ణ, సరియపల్లి మధు, కింజరాపు చిన్నవాడు తదితరులుపాల్గొన్నారు.

టీడీపీ విజయమే లక్ష్యం

కొత్తూరు: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి అన్నారు. మాతల గ్రామంలో కొత్తూరు మండల టీడీపీ, జనసేన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం, గ్రామాల పర్యటనపై వివరించారు.



ఎచ్చెర్ల: బలిజిపేటలో సూపర్ సిక్స్ కరపత్రాన్ని అందిస్తున్న కిమిడి కళావెంకటరావు

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గార: టీడీపీ అధినేత చంద్రబాబు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కలిసి రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. పీలకపేటలో బుధవారం బాబూ ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి అంబటి చక్రధరరావు, టీడీపీ నాయకులు జె.జగన్, వి.శ్రీనివాస్ జి.హిమగిరి, ముద్దాడ రమణ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి

సంతబొమ్మాళి: టీడీపీ ప్రభుత్వంలోనే తీరప్రాంత మలగాం పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి అప్పన్న, మాజీ ఎంపీపీ చిదపాన ధర్మార్జునరెడ్డి అన్నారు. బుధవారం మలగాం పంచాయతీలో సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుచ్చ మురళీకృష్ణ, బుచ్చ మోహన్‌రావు, వజ్జ ప్రభాకర్, దుపాన రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమ పాలన

జలుమూరు (సారవకోట): టీడీపీ ప్రకటించిన బాబు సూపర్ సిక్స్ పథకాల అమలు ద్వారానే అన్ని వర్గాలకు సంక్షేమ పాలన అందుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. బద్రి ఎస్సీ, బీసీ కాలనీలో బుధవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వెళ్లి వైసీపీ వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గార: అవగాహన కల్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

వైసీపీకి చరమగీతం పాడుదాం

జి.సిగడాం: అరాచక వైసీపీకి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చరమగీతం పాడాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం దవళపేట పంచాయతీ విజరాంపురం, ఆనందపురం పంచాయతీ అబోతులపేట గ్రామాల్లో నిర్వహించిన బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీని గెలిపించేందుకు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, విజయనగరం పార్లమెంటరీ బీసీ కమిటీ అధికార ప్రతినిధి కంచరాన సూరన్నాయుడు, నాయకులు టంకాల మౌళీశ్వరరావు, చిత్తిరి అసిరినాయుడు, పైల రామకృష్ణంనాయుడు, కోన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరులో బాబు ష్యూరిటీ

పొందూరు: మండలకేంద్రం పొందూరులో బుధవారం టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు ఎస్.భాస్కర్, వాసు. మురళి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గూడలో విస్తృత ప్రచారం

టెక్కలి: మొఖలింగాపురం పంచాయతీ చిన్నకేదారి గిరిజన గూడలో బుధవారం టెక్కలి మండల టీడీపీ శ్రేణులు భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న పథకాలను గిరిజన మహిళలకు వివరించారు.



నరసన్నపేట: కరపత్రాలిచ్చి వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు

ప్రతి 50 మందిని దత్తత తీసుకోవాలి

పలాస: ప్రతి 50 మందికి ఒక కుటుంబ సాధికారిత సారధులు దత్తత తీసుకొని టీడీపీ అమలు చేయనున్న సూపర్-6 పథకాలను వివరించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు యార్లగడ్డ వెంకన్నచౌదరి అధ్యక్షతన బుధవారం టీడీపీ కార్యాలయంలో కుటుంబ సాధికారిత సారధులతో సమావేశం నిర్వ హించారు. వలంటీర్ల కన్నా మెరుగ్గా సేవలు చేసి రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి దోహద పడాలని కోరారు. భవిష్యత్తుకు గ్యారెంటీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, అంబటి కృష్ణమూర్తి, సప్ప నవీన్, జోగ మల్లి, శంకర్, గోళ్ల చంద్రరావు, టంకాల రవిశంకర్‌గుప్తా, సత్యం, రామకృష్ణ, దడియాల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు







సంతబొమ్మాళి: మలగాం, జి.సిగడాం: విజయరాంపురం, పొందూరు, టెక్కలి:చిన్నకేదారి, జలుమూరు (సారవకోట): బద్రి ఎస్సీ కాలనీల్లో బాబు ష్యూరిటీ, సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

కిడ్నీ పరిశోధనా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

పలాస, ఫిబ్రవరి 21: స్థానిక పద్మనాభపురం గ్రామం వద్ద ఇటీవల ప్రారంభించిన కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆసుపత్రిని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ బుధవారం సందర్శించారు. ఈ సంద ర్భంగా వైద్యాధికారి అల్లు పద్మజ, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులు పరిశీలించి రోగులకు అందిస్తున్న సేవలు, ఆసుపత్రిలో పరికరాలు, మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి రక్షణ గోడ, పరికరాలు కావాలని వైద్యాధికారి ఆయన దృష్టికి తీసుకురాగా వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ తెలిపారు. అంతకు ముందు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడున్న పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్స్‌లు భద్రపరిచే గదులను పరిశీ లించారు. అలాగే కాశీబుగ్గ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రభుత్వ గృహాలు, ఇళ్ల స్థలాల లబ్ధి దారులకు సకాలంలో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండలం రిజిస్ట్రేషన్లలో వెనుకబడి ఉందన్నారు. ఆయన వెంట ఆర్డీవో భరత్‌నాయక్, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, తహసీల్దార్ ఎస్‌వీవీఎస్ నాయుడు, ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

హిరమండలం: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని హిరమండలం జడ్పీటీసీ పి.బుచ్చి బాబు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను కోరారు. ఈ మేరకు బుధ వారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గొట్టాబ్యారేజి నిర్వహణలో లోపాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం బ్యారేజి కంట్రోల్ రూమ్ వద్ద సిబ్బంది కూడా అందుబాటులో ఉండడం లేదని కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లారు. జడ్పీటీసీతో పాటు టీడీపీ నేత తేజేశ్వరరావు ఉన్నారు.



ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ కార్యవర్గాల ఎన్నిక

టెక్కలి: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 టెక్కలి శాఖ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎంవీ గోపాలరావు, రాష్ట్ర కమ్యూనికేషన్ కార్యదర్శి ఎం.ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా దాసరి శేఖర్, కార్యదర్శిగా నక్కా లోకేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అన్నెపు గోపాలరత్నం, కోశాధికారిగా మెట్ట హిమగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఈశ్వరరావు, ఆఫీస్ సెక్రటరీగా కరుణాకర్, కమ్యూనికేషన్ సెక్రటరీగా వాసుదేవరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పలాస శాఖకు..

పలాస: పలాస సబ్‌డివిజన్ విద్యుత్ ఉద్యోగుల సంఘాన్ని బుధవారం ఎన్నుకున్నారు. నరసన్నపేటలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కొమ్మల గిరీశ్వ రరావు, ప్రధాన కార్యదర్శిగా గార రాజారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.పాణిగ్రాహి, కోశాధికారిగా మెట్ట హిమగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.రామచంద్రుడు, కార్యాలయం కార్యదర్శిగా ఎస్.అప్పలకొండ, కమ్యూని కేషన్ కార్యదర్శిగా ఎస్.భాస్కరరావులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఆర్.రాజేశ్వరరావు వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన ప్రతినిధులను రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎంవీ గోపాలరావు అభినందించారు.

విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలి: డీఈవో

హిరమండలం: ఉపాధ్యాయులు విధుల్లో బాధ్యతగా వ్యవహరించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని డీఈవో కె.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం సుభలయ యూపీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (లిప్)ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లా సర్వశిక్షాభియాన్ ఏఎంవో జి.లక్ష్మీనారాయణ, రాష్ట్ర బృందం ప్రతినిధులు ప్రవీణ్ కుమార్, ఎం.రమేష్, ఎంఈవో కె.రాంబాబు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

తురకపేట(ఎల్.ఎన్.పేట): గ్రామాల్లో అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేసి పూర్తి చేయాలని తహసీల్దార్ ఎస్.రాణి అమ్మాజి అన్నారు. పెద్దకొల్లివలస, తురకపేట గ్రామాల గ్రామసచివాలయాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గవరయ్య వీఆర్వో జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

- ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై దాడికి నిరసన
- ఆర్డీవో, డీఎస్పీలకు వినతిపత్రం

పలాస/కాశీబుగ్గ/పలాస రూరల్, ఫిబ్రవరి 21: అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ పాల్గొన్న సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై వైసీపీ గూండాలు దాడికి పాల్పడడం దారుణమని, దీనికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతి నిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పలాస- కాశీబుగ్గ, మందస, వజ్రపుకొత్తూరు మండలాల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ర్యాలీగా మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. అనంతరం దాడికి పాల్పడిన వైసీపీ మూకలపై చర్యలు చేపట్టాలని కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, ఆర్డీవో భరత్ నాయక్‌లకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు డి.మహరణ, సీహెచ్ జగదీశ్, అంది రామకృష్ణ, నేతాజీ, ఎస్.హరి నారాయణ, ఎస్.రూప్‌సుందర్, ఈశ్వర పాత్రో, బి.సూర్యనారాయణ, ఆర్టీ భుజంగరావు, డి.విశ్వేశ్వరరావు, చిట్టి, అశోక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఫొటో జర్నలిస్టుపై వైసీపీ మూకలు దాడులకు పాల్పడడాన్ని సీపీఐఎంఎల్ న్యూడెమో క్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, ఆ పార్టీ నాయ కులు జుత్తు వీరాస్వామి ఖండించారు. భవిష్యత్తులో జర్నలి స్టులపై దాడులు జరగకుండా దోషులపై కఠిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జర్నలిస్టుల చేపట్టిన ఆందోళనకు వారు మద్దతు పలికారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు

దాడులపై పీసీఐ ఛైర్మన్‌కు ఫిర్యాదు


సంతబొమ్మాళి: రాష్ట్రంలో జర్నలిస్టులు, పత్రికలపై జరుగుతున్న దాడులపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) ఛైర్మన్ జస్టిస్ రంజన్‌ప్రకాష్ దేశాయ్‌కు ఫిర్యాదు చేసినట్లు బోరుభద్రకు చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సీఎం సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడం దుర్మార్గమన్నారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, జర్న లిస్టులు, పత్రికలకు రక్షణ కల్పించాలని ఆ ఫిర్యాదులో కోరినట్లు ఆయన తెలిపారు.

పత్రికలపై దాడులు సిగ్గుచేటు

నరసన్నపేట: ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచే పత్రికలు, విలేకరులపై దాడి చేసి భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుచేటని సీపీఎం (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు నేతింటి నీలంరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణ, కర్నూలులోని ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకలు దాడి చేయడం దుర్మార్గమన్నారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పత్రికారంగాన్ని కాపాడాలని రాష్ట్రపతికి ఉత్తరాలు

రణస్థలం: పత్రికా రంగాన్ని కాపాడాలని కోరుతూ రాష్ట్రపతికి ఉత్తరాంధ్ర నుంచి లక్ష ఉత్తరాలను పంపనున్నట్లు పొందూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఇటీవల పత్రికా కార్యాలయాలు, జర్నలిస్టులపై దాడులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. పత్రికా రంగంపై భౌతిక దాడులు జరగకుండా కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలి

టెక్కలి: గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. బుధవారం ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు స్నేహితులుగా, సోదర భావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, సీనియర్ న్యాయవాది ధవళ రాజేశ్వరరావు, ప్రిన్సిపాల్ రవికుమార్, ఏఎస్ఐ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రసన్నలత

చట్టాలపై అవగాహన కల్పించాలి

నరసన్నపేట: మహిళలకు చట్టాలపై మరింత అవగాహన కల్పించాలని స్థానిక కోర్టు సివిల్ న్యాయాధికారి హరిప్రియ సూచించారు. బుధవారం కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాలల హక్కులపై పాఠశాలల్లో తెలియజేయాలన్నారు. మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఏళ్ల తరబడి పరిష్కారం కాని కేసులను రాజీ చేయడం జరుగుతుందన్నారు. దీనిపై న్యాయ వాదులు తమ క్లయింట్‌లకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నియంత్రణకు కృషి చేయండి

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో జరుగుతున్న బాల్యవివాహాలను గ్రామ, మండల స్థాయి కమిటీల ద్వారానే నియంత్రించడం సాధ్యపడుతుందని, ఈ దిశగా కృషి చేయాలని కొత్తూరు ఐసీడీఎస్ సీడీపీవో యు.విమల కుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధ వారం ఎంపీపీ ఆర్.జ్యోతిలక్ష్మి అధ్యక్షతన అంగన్ వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా ఉండేందుకు త్వరలో గ్రామస్థాయి కమిటీలను నియమిస్తామన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగించాలని సూచించారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరుని కల్యాణం

ఒడిశా

పర్లాకిమిడి: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం స్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ప్రధానార్చకులు భద్రం శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మహోత్సవాన్ని ధర్మకర్తలు పైడిఘంటం వారి కుటుంబ సభ్యులు చేశారు.

విగ్రహాల ప్రతిష్ఠ

పర్లాకిమిడి: స్థానిక డోలే బ్యాంక్ రోడ్డులోని శివాలయంలో విఘ్నేశ్వర, హనుమ, కార్తికేయ విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ వేడుకగా జరిగింది. కార్యక్రమంలో ఎంఎల్ఏ నారాయణరావు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా ప్రతిష్ఠోత్సవాలు



నందిగాం: దిమ్మిడిజోలలో రామమందిర పునః ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధ వారం విగ్రహాలకు జల, క్షీర, ధాన్య, పుష్పాదివాస కార్యక్ర మాలు నిర్వహించారు. పురోహి తులు ప్రసాద్‌శర్మ, మదన్ మోహన్ మిత్ర పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు. ● సుబ్బమ్మపేటలో వేంచేసి ఉన్న లక్ష్మీనరసింహ స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం చక్రతీర్థ స్నానం నిర్వహించారు. ధర్మకర్త కేకే రంగనాథాచార్యులు ఆధ్వర్యంలో చామర్తి శ్రీనివాసాచార్యులు, కె.రామానుజాచార్యులు పర్యవేక్షణలో పూజలు చేసి స్థానిక పుష్కరిణిలో మేళతాళాల మధ్య విగ్రహాలకు చక్రతీర్థ స్నానం చేయించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

జలుమూరు: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నగిరికటకంలో భీష్మ ఏకాదశి వేడుకల్లో బుధవారం ఆయన స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, కన్వీనర్ బగ్గు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు

జలుమూరు/హిరమండలం/నందిగాం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు కోరారు. బుధవారం జలుమూరు, హిరమండలం ఉన్నత పాఠశాలలు, నందిగాం జూనియర్ కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రణాళికా బద్ధంగా చదివి పరీక్షలకు సిద్ధం కావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



జలుమూరు: డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు




హిరమండలం, నందిగాంలలో డ్యాన్స్‌లు చేస్తున్న విద్యార్థినులు

5.2 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

పలాస: పలాస రైల్వేస్టేషన్‌లో బుధవారం తమిళనాడు రాష్ట్రానికి చెందిన కె.సంతోష్ అనే వ్యక్తి 5.2 కిలోల గంజాయితో రైల్వే పోలీసులకు పట్టుబడ్డాడు. ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరి నుంచి హౌరాకు రైలులో గంజాయిని తీసుకువెళుతున్న సంతోష్‌పై అనుమానంతో తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. నిందితుడిపై కేసు నమోదు చేసి పలాస రైల్వే పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా ఇటీవల కాలంలో అధిక సంఖ్యలో గంజాయి తరలిస్తున్న నేపథ్యంలో పోలీసుల తనిఖీలు ముమ్మరం చేయడంతో గంజాయి రవాణాలో నిందితులు పట్టుబడుతున్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్లు..

శ్రీకాకుళం క్రైం: పేకాట ఆడుతూ టూటౌన్ పోలీసులకు పలువురు పట్టుబడ్డారు. టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని ఓ ఎలక్ట్రికల్ షాపు వెనుక ఉన్న ఖాళీ స్థలంలో కొందరు పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం సిబ్బందితో దాడి నిర్వహించారు. ఈ దాడిలో కోరాడ రంజిత్‌కుమార్ అనే వ్యక్తితో పాటు మరో నలుగురు జూదం ఆడుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.17,585లతో పాటు ఐదు సెల్‌ఫోన్లు, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై సీఐ కేసు నమోదు చేశారు.

ప్రాంగణ నియామకాల్లో 233 మంది ఎంపిక


ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన విద్యార్థులు

ఎచ్చెర్ల: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ (చెన్నై) బుధవారం నిర్వహించిన ప్రాంగణం నియామకాల్లో 233 మంది ఎంపికయ్యారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 256 మంది హాజరుకాగా, ఇందులో 233 మందిని ప్రొడక్షన్ ట్రైనీలుగా ఎంపిక చేశారు. వీరికి నెలకు రూ.18 వేలు జీతంతో పాటు ఇతర అలవెన్స్‌లు అందజేస్తారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అరుణ్‌కుమార్, దామోదరరావు, యుగంధర్, గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి హౌస్ అరెస్ట్


వెంకటరావుకు నోటీసు అందిస్తున్న పోలీసు

పాతపట్నం: కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు మేరకు విజయవాడలో గురువారం నిర్వహించనున్న చలో సెక్రటేరియట్‌కు వెళ్లకుండా కాంగ్రెస్ నాయకుడు కొప్పురోతు వెంకటరావును బుధవారం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ముందస్తు చర్యలో భాగంగా ఆయనకు పోలీసులు నోటీసుఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నియంతృత్వ వైఖరి పరాకాష్ఠకు చేరుకుందని ఆరోపించారు. ప్రజల పక్షాన మెగా డీఎస్సీ కోరుతూ కాంగ్రెస్ ఇచ్చిన పిలుపు మేరకు బయలుదేరితే పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామి కమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ వైఖరికి ప్రజలు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధిచెబుతారన్నారు.

టోల్‌ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టరేట్: ఎన్నికల ఫిర్యాదు కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ కోరారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేసీ ఎం.నవీన్ కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సాధారణ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదుల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు 1950కు సంబంధించిన వివరాలను తెలియజేశారు. టోల్‌ఫ్రీ నెంబర్‌తో పాటు 18004256625 నంబరు కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేకంగా నియమించిన నోడల్ అధికారి ఆధ్వర్యంలో ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ఈ వ్యవస్థ పనిచేస్తుందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో ఎం.అప్పారావు, పీఎంజే బాబు (టీడీపీ), రౌతు శంకరరావు (వైసీపీ), డి.మల్లిబాబు(కాంగ్రెస్), సురేష్‌సింగ్ బాబు(బీజేపీ) తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనాన్ని ప్రారంభించిన ఎంపీ


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రామ్మోహన్

అరసవల్లి: బలివాడ గ్రామంలో రూ.10 లక్షలు ఎంపీ నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఎంపీ కింజరాపు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి తప్ప ప్రస్తుత ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ గతంలో వేసిన రోడ్డే అని, ఇప్పటికీ ప్రధాన రహదారి సమస్యగా నే ఉందని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డును నిర్మిస్తామన్నారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.

కాకినాడ ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి


నినాదాలు చేస్తున్న మత్స్యకార సంఘ నాయకులు

అరసవిల్లి: వైసీపీకి చెందిన కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖర్రావు మత్స్యకార నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కొండబాబుపై చేసిన విమర్శలు మత్స్యకార జాతికే అవమానకరమని, వెంటనే ఆ ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని మత్స్యకార సంఘం నాయకుడు మైలపిల్లి నర్సింగరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక డచ్ బంగ్లా వద్ద నిర్వహించిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత కక్షలు ఉంటే రాజకీయ పరమైన విమర్శలు చేసుకోవచ్చని, కానీ ఏకంగా మత్స్యకార కులాన్నే కించపరిచేలా మాట్లాడడం సరికాదన్నారు. తక్షణమే క్షమాపణ చెప్పాలని లేకపోతే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాప్తాడు సభలో మత్స్యకార కులానికి చెందిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి చేయడం వైసీపీ నేతల దురహంకారానికి, దౌర్జన్యానికి నిదర్శనమని ఆయన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి మైలపిల్లి త్రినాథరావు, నాయకులు మైలపిల్లి పోలీసు, డి.అశోక్, కొమర కమల, చీకటి శ్రీరాములు, చింతపల్లి సూర్యం, కేశవ రాంబాబు, కోడ లక్ష్మీపతి, సీహెచ్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఆదిపరాశక్తి క్షేత్ర పీఠాధిపతి


అరసవల్లి: స్వామీజీకి జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి ఆదిత్యుని బుధవారం ఆదిపరాశక్తి క్షేత్ర పీఠాధిపతి నిత్య విద్యానంద భారతి స్వామి దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

● **గార:** ప్రసిద్ధ శ్రీకూర్మనాథున్ని చిలకలూరుపేట ఆదిపరాశక్తి దేవస్థానానికి చెందిన నిత్య విద్యానంద భారతీ స్వామి వారు బుధవారం ఉదయం దర్శించుకున్నారు. దక్షిణ భారత యాత్రలో భాగంగా ఈ స్వామి వారి దర్శనం చేసుకున్నారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి కూర్మనాథుని చిత్ర పటాన్ని ఆలయ ఈవో గురునాథరావు వారికి అందచేశారు. ప్రధాన అర్చకులు సీతారామ నర్సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషపై మమకారంతో మెలగాలి

● బీఆర్‌ఏయూ వీసీ


ఎచ్చెర్ల: సుబ్బారావును సత్కరిస్తున్న వీసీ తదితరులు


నందిగాం: అ.. అక్షర క్రమంలో విద్యార్థుల ప్రదర్శన


పాతపట్నం: తెలుగుతల్లి వేషధారణలో..

ఎచ్చెర్ల: మాతృభాష మమకారంతో ప్రతి ఒక్కరూ మెలగాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ కేఆర్ రజని అన్నారు. అంతర్జాతీయ మాతృభాషాది నోత్సవం సందర్భంగా వర్సిటీలో తెలుగు, ఆంగ్ల విభాగాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వ హించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏయూ విశ్రాంతి ప్రొఫెసర్ పర్వతనేని సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యధికంగా మాండలికాలు, భాషలు కలిగిన దేశం భారత్ అని చెప్పారు. భాష- పుట్టుపూర్వోత్తరాలు అనే అంశంపై అనే అంశంపై వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, తెలుగు, ఆంగ్ల విభాగాల కోఆర్డినేటర్లు ఎం.బలరాంనాయుడు, పి.రవికుమార్, ప్రముఖ సాహితీ వేత్త అల్లంశెట్టి చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటైర్డు ప్రొఫెసర్ పర్వతనేని సుబ్బారావును సత్కరించారు.

● **జి.సిగడాం:** మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైనా ఉందని ఎంఈవో అరసాడ రవి అన్నారు. మండలంలో పలు పాఠశాలల్లో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోతసవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష వైభవానికి పునాధులు వేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **ఆమదాలవలస:** కొర్లకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. తెలుగు భాషోపాధ్యాయులు శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం గ్రామంలో మాతృభాషా ఆవశ్యకతపై మానవహారం నిర్వహించి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం యమున, ఉపాధ్యాయులు సరస్వతి, శ్రీనివాస్, రాజు, శ్రీనివాసరావు, సుజాత, సుధాకర్ పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ రోబిన్‌కుమారి పాడీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మాతృభాషా దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాల ఆవరణలో జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుశాంత్ జన్నా, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

● **టెక్కలి:** తెలుగు భాషను పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. అధ్యాపకులు లీలా పద్మజ, రామారావు, త్రినాథ్, శ్రీనివాసరావు, జగన్నాథ్ బిసాయి పాల్గొన్నారు. మధుప్రియ సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

● **పాతపట్నం:** మాతృభాషపై పట్టు సాధించడం ద్వారా విజ్ఞాన సముపార్జన సులభతరమవుతుందని హెచ్ఎం ఎస్.వైకుంఠరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు కవుల సేవ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థిని తెలుగుతల్లి వేషధారణ ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **నందిగాం:** పెద్దతామరాపల్లి పాఠశాలలో బుధవారం మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు అ అక్షర క్రమంలో కూర్చొని మా తెలుగుతల్లి గేయాన్ని ఆలపించారు. గిడుగు రామ్మూర్తి, తెలుగుతల్లి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతు అందించారు. బి.శంకరరావు, వి.కుమారి, కె.తిరుపతిరావు, వనిత ఉన్నారు.

కవులకు సత్కారం


పలాస: కవులను సత్కరిస్తున్న నిర్వాహకులు

పలాస: మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని వక్తలు అన్నారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనజాగృతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు, కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కవులను సత్కరించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బమ్మిడి సుబ్బారావు, సంస్థ వ్యవస్థాపకుడు తెప్పల కృష్ణమూర్తి శశిధర వర్మ, కాళిదాస్, ఆదినారాయణ, హెచ్ఎం డి.దాశరథి పాల్గొన్నారు.

ఫ్రీలోక్ అదాలత్‌ను వినియోగించుకోండి


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

గుజరాతీపేట: వచ్చే నెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల రాజీ కోసం ప్రతి రోజూ ఫ్రీ లోక్‌అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహించనున్నట్టు, వాటిని కక్షిదారులు వినియోగించుకోవాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ లోక్ అదాలత్‌లతో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేసేందుకు ప్రతి రోజూ శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు జ్ఞాన సువర్ణరావు ఆధ్వర్యంలో ఫ్రీ లోక్‌అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఫ్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ ప్రతిరోజూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనలో ఉన్న శాశ్వత లోక్ అదాలత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

● **పొందూరు:** కక్షిదారులకు పంతాలకు పోకుండా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులు రాజీ చేసుకోవాలని పొందూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.జోత్స్న సూచించారు. మండల కేంద్రంలోని కోర్టులో బుధవారం విలేఖరులతో మాట్లాడారు. వచ్చే నెల 9న జాతీయలోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నవారు, అందులోనుంచి బయటపడేందుకు లోక్‌అదాలత్ ఉపయోగపడుతుందన్నారు.

లోకేశ్‌కు ఆదిత్యుని చిత్రపటం అందజేత



రణస్థలం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను అరసవల్లి సూర్యనారాయణ స్వామి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాన్ని పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు అందజేశారు. ఇటీవల ఉత్తరాంధ్రలో శంఖారావం కార్యక్రమం విజయవంతం కావడంతో ఆదిత్యుని తీర్థప్రసాదాన్ని లోకేశ్‌కు అందజేశారు. టీడీపీ జనసేన కూటమి భారీ మెజార్టీతో గెలుపొందేందుకు 'శంఖారావం' ఉపయోగపడిందని అప్పలనాయుడు వెల్లడించారు.

'పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు నింపండి'

గార: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందుబాటులో తీసుకు వస్తున్న వలంటీర్లు రానున్న ఎన్నికల్లో 80 ఏళ్ల దాటిన వృద్ధ, వికలాంగులకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు నింపడంలో సహకరించాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. బుధవారం అంపోలు సమీపంలో నిర్వహించిన వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం 80 ఏళ్లు దాటిని వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని చెపుతోందని, అందువల్ల వారందరికీ దరఖాస్తులు నింపడంపై సహకరించాలని వలంటీర్లకు సూచించారు. ఏ రాజకీయ పార్టీకి ఓటు వేయాలో వలంటీర్లు చెప్పకూడదని కూడా ఏ రాజ్యాంగం చెప్పలేదని, అందువల్ల రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రావడానికి వలంటీర్లు కృషి చేయాలని అన్నారు. అవసరం అనుకుంటే బూత్ ఏజెంట్లుగా వలంటీర్లు పనిచేయాల్సి ఉంటుందన్నారు. కాగా మంత్రి వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీపీలు గొండు రఘురామ్, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

● **బూర్జ:** పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు బుధవారం పురస్కారాలు అందించారు. ఎంపీపీ కర్నేనదీప, జడ్పీటీసీ రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నిద్దాలమ్మకు ప్రత్యేక పూజలు

జి.సిగడాం: నిద్దాంలో నిద్దాలమ్మ గ్రామదేవత వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి పత్యేక పూజలు నిర్వహించారు. గత నాలుగు రోజులుగా అమ్మవారికి గ్రామ, పరిసర గ్రామ భక్తులు పసుపు, కుంకుమ, చీరలు, ముర్రాటలు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సుమారు రెండువేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన

కవిటి: బెంతు ఒరియాలు మోకాళ్లపై కూర్చొని కవిటిలో బుధవారం నిరసన తెలిపారు. 57 రోజులుగా కవిటి బస్టాండ్‌లో నిరసన దీక్ష చేస్తున్నారు. తమ కులానికి గుర్తింపు కల్పించాలని, ధ్రువపత్రాలు మంజూరు చేయాలని వారు డిమాండు చేశారు. కమీషన్లతో కాలయాపన చేశారే తప్ప న్యాయం చేయలేదని వాపోయారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీని మరచిపోయారే తప్ప మా కులానికి న్యాయం చేసే దిశగా ఆలోచన చేయడం లేదని విమర్శించారు. నిరసనలో జయసేన్ బిసాయి, అనంత్ దొళాయి, భైరవి సాహు పాల్గొన్నారు.

ప్రజాపోరు ద్వారా సమస్యల గుర్తింపు

ఇచ్ఛాపురం: ప్రజా సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకే ప్రజాపోరు-2 చేపడుతుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్దాల నిర్మలారెడ్డి అన్నారు. బుధవారం బూర్జుపాడు, చిన్న, పెద్ద లక్ష్మీపురం, డొంకూ రు, శివకృష్ణాపురం గ్రామాల్లో ప్రజాపోరు నిర్వహించారు.

జాగ్రత్తలు పాటించాలి

బూర్జ: అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు పాటించాలని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు సూచించారు. పాలవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధ వారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం అగ్ని ప్రమాదాల పరికరాల వినియోగంపై అవగాహన చేశారు. హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

జయమ్మ స్మారక సభకు తరలిరండి

గార: సిక్కోలు పోరు బిడ్డ వీరనారి జయమ్మ వర్ధంతి సందర్భంగా ఈ నెల 22న శ్రీకాకుళం ఎన్జీవో హోంలో జరగనున్న స్మారక సభకు ప్రజలు తరలిరావాలని న్యూడెమోక్రసీ పార్టీ, వివిధ ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం నిర్వహించిన జయమ్మ స్మారక దినాల్లో భాగంగా నాలుగోరోజు సందర్భంగా జయమ్మకు నివాళులర్పించారు. తాండ్ర ప్రకాష్, సన్నశెట్టి రాజశేఖర్, జి.గణేస్, ఎస్.కృష్ణవేణి తదతరులు పాల్గొన్నారు.

వేణుగోపాలుని హుండీ ఆదాయం రూ.13 లక్షలు

గార: ప్రసిద్ధ శ్వేతగిరిపై వెలసిన వేణుగోపాల స్వామి యాత్రకు సంబంధించి ఆలయ హుండీలను బుధవారం తెరచి లెక్కించారు. ఈ యాత్రకి వచ్చే భక్తులు దర్శనం టిక్కెట్లు, హుండీ కేశ ఖండనాలు ద్వారా రూ.13.08 లక్షలు ఆదాయం లభించిందని ట్రస్ట్ బోర్డు చైర్మన్ సుగ్గు మధురెడ్డి తెలిపారు. దేవదాయ శాఖ అధికారులు పెద్దలు సమక్షంలో ఈ హుండీలను లెక్కించారు.

పరిపాలనలో వైసీపీ విఫలం

ఆమదాలవలస: వైసీపీ ప్రభుత్వ అరాచకాలు, అవినీతిపై బీజేపీ చేపట్టిన ప్రజాపోరు బొబ్బిలిపేట, దండేవలస గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పాలన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతాడ అప్పారావు, వేల్పుల గోవిందరావు, పిల్లా జగన్, సాధు స్వాతి, లోలుగు సింహాచలం, సాధు కిరణ్, శ్రీనివాస్, గుంటి రాము తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అణచివేత దుర్మార్గం

ఆమదాలవలస: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో పనిచేస్తున్న కార్మికుల అణచివేత దుర్మార్గమని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఎదుట ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం పరిధిలోని ఏఆర్ఎస్, ఆర్ఏఆర్ఎస్, కేవీకేల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల శిబిరాన్ని సందర్శించిన సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం కాంట్రాక్ట్ కార్మికుల అధ్యక్షురాలు ఎన్.సీతామహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

సరుబుజ్జిలి: షలంత్రి, సింధువాడ, మూలసవలాపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ జె.రమేష్‌బాబు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వసతి, తాగునీరు సదుపాయం, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి విషయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న సదుపాయాలు కల్పించే దిశగా పనిచేయాలని సిబ్బందికి తెలిపారు. పరిశీలనలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాబూరావు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆ పాఠశాలపై విచారణ అనంతరం చర్యలు

ఆమదాలవలస: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జరిగిన ఘటనపై పూర్తిస్థాయి విచారణ తర్వాత చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ ఆర్‌జేడీ ఎం.జ్యోతికుమారి తెలిపారు. ఆ పాఠశాలపై ఇటవల వచ్చిన ఆరోపణలపై బుధవారం డీఈవో కె.వెంకటేశ్వరరావుతో కలిసి ఆర్జేడీ విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ కార్యాలయంలో పాఠశాలపై సమగ్ర వివరాలను అడిగి తెలుసుకొని తల్లిదం డ్రుల నుంచి ఫిర్యాదు వివరాలు, ఎంఈవో విచారణ నివేదికలు పరిశీలించి పాఠశాల యాజమాన్య పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఆ పాఠశాలలో నెలకొన్న ఘటనపై డీఈవో, డిప్యూటీ డీఈవో ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2, సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ వేలం పాటలు ఖరారు

ఇచ్ఛాపురం: మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ వేలం పాటలు ప్రశాంతంగా జరిగాయి. కమిషనర్ ఎన్.రమేష్ అధ్యక్షతన బుధవారం జరిగిన 2024-25 సంవత్సరానికి సంబంధించి దినవారి మార్కెట్ ఆశీలు, కమేలా, లైబ్రరీ పాతపేపర్లు, కొబ్బరి పలసాయం బహిరంగ వేలం పాటలు ఖరారయ్యాయి. అన్నింటిని పిట్ట బైరాగి సొంతం చేసుకున్నాడు. గతేడాది కంటే మున్సిపాల్టీకి రూ.6లక్షలు ఆదాయం తగ్గింది. ఈ వేలంలో ఆరుగురు పాటదారులు పాల్గొన్నారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి

ఇచ్ఛాపురం: అకడమిక్ కేలండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని హెచ్ఎంలను డిప్యూటీ డీఈవో విజయకుమారి సూచించారు. బుధవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలు రాయకముందే సిలబస్ పూర్తి చేయాలన్నారు. ప్రతీ విద్యార్థి ట్యాబ్స్ ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని, ఇంట్రాక్టీవ్ ఫ్లాట్ పేనల్స్ వినియోగించుకోవాలన్నారు. రిజిస్టర్ తప్పకుండా ఉపయోగించాలని, విద్యార్థులు రాసిన నోట్‌బుక్స్ తప్పనిసరిగా కరక్షన్ చేయాలన్నారు. ఎంఈవో కె.అప్పారావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే అనుమతులు

శ్రీకాకుళం క్రైం: నిబంధనల ప్రకారమే అర్జీదారులకు ప్లానింగ్‌లు మంజూరు చేస్తామని నగరపాలక కమిషనర్ తమీమ్ అన్సారియా తెలిపారు. నగరపాలక సంస్థకు ప్లానింగ్ కోసం పలువురు అర్జీ చేసుకోగా బుధవారం కమిషనర్ క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలించారు. నగరంలోని పీఎన్ కాలనీ, కొయ్యాన కన్నయ్య కాలనీలో నూతనంగా నిర్మించుకునేందుకు అర్జీ పెట్టుకున్న వారి భవన నిర్మాణాలను కమిషనర్ సందర్శించారు. ఏసీపీ బివీ రమణమూర్తి, టీపీవో ఉమామహేశ్వరరావు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు


గుండ దంపతులకు పుష్పగుచ్ఛం అందిస్తున్న యువత

అరసవల్లి: ఒక్కసారి అని అడిగితే ప్రజలు జగన్‌రెడ్డికి అవకాశం ఇచ్చినందుకు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, అభివృద్ధిని తిరోగమనం పట్టించారని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి దంపతులు అన్నారు. బుధవారం తమ నివాసంలో పెద్దపాడుకు చెందిన యువతను ఉద్దేశించి వారు మాట్లాడారు. ప్రతీ గ్రామం నుంచి చదువుకున్న యువత రాష్ట్రంలోని స్థితిగతులను అర్థం చేసుకుని, వైసీపీ ప్రభుత్వ అరాచకాలను గుర్తించి, ప్రజాస్వామ్య పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. యువత సమాజ అభివృద్ధి, నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

పొందూరు: సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్‌సెంటర్లు అభివృద్ధికి సూచికలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. లోలుగు గ్రామంలో బుధవారం సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ లోలుగు ధనలక్ష్మి, జడ్పీటీసీ ఎల్.కాంతారావు ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి, ఎంపీడీవో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు మాజీ సైనికులు

కలెక్టరేట్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బందోబస్తు డ్యూటీ చేసేందుకు ఆసక్తి గల 50 ఏళ్ల వయసులోపు గల మాజీ సైనికుల వివరాలను ఎస్పీ జీఆర్ రాధిక కోరినట్టు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎశైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల మాజీ సైనికులు శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయంలో తమ వివరాలను సమర్పించాలని కోరారు. ఎన్నికల సమయంలో అందించిన సేవలకు గౌరవ వేతనం ఇవ్వనున్నట్టు స్పష్టం చేశారు.

గురుకులంలో లిప్ బృందం

ఎచ్చెర్ల: దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో రాష్ట్ర అభ్యసనాభివృద్ధి కార్యక్రమం (లిప్) రాష్ట్ర బృందం బుధవారం సందర్శించింది. ఈ కార్యక్రమం అమలుతీరును, విద్యార్థుల అభ్యసన ప్రక్రియలను పరిశీలించారు. విద్యార్థుల స్థాయి ఏ మేరకు ఉందన్న విషయాన్ని చూశారు. ఈ బృందంలో ఎన్.శ్రీనివాస్ ఎస్.జయకృష్ణ, జె.రవి, ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

సోంపేట: రామయ్యపట్నం గ్రామానికి చెందిన ఇరోతు భాస్కర్ కుటుంబాన్ని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా పార్టీ ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి సూరాడ చంద్రమోహన్, నిట్ట గోపాల్, ఆర్.బాబూరావు, ఎస్.గురుమూర్తి తదితరులు ఉన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

అరసవల్లి: జిల్లా వ్యాప్తంగా మార్చి 3వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి పిలుపునిచ్చారు. బుధవారం తన కార్యాలయ సమావేశం మందిరంలో వైద్యాధికారులతో సమీక్షించారు. జిల్లాలో 0-5 సంవత్సరాల పిల్లలు 2,33,823 ఉన్నారని, వారందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. డీఐఏ ఈశ్వరీదేవి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, వైద్యులు పి.ప్రకాశరావు, సుజాత, .వెంకటలక్ష్మీ, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వరరావు, మోహిని పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించండి

పొందూరు: రానున్న ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక, అంతంత సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపించడంలో పోలీసులదే కీలకపాత్రన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు.

'పథకాలు నిలిపివేయడం సరికాదు'

ఇచ్ఛాపురం: టీడీపీ హయాంలో మాజీ సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన చంద్రన్న పెళ్లి కానుక, సంక్రాంతి కానుకలు వంటి పథకాలను వైసీపీ ప్రభుత్వం నిలిపివేయడం సరికాదని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆనాడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు యువతల వివాహానికి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించి చంద్రన్న పెళ్లి పథకానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ప్రొఫెషనలన్ వింగ్ పార్లమెంట్ లధక్ష్యుడు పూనా సంతోష్, జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు జిల్లానీ. పైల నారాయణ పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయండి

ఇచ్ఛాపురం: పాసపాటిరేగలో ఈ నెల 25న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పల్లంట్ల వెంకటరామారావు పిలుపు నిచ్చారు. పాదయాత్ర ముగింపు సందర్భంగా ఇచ్ఛాపురం వచ్చిన ఆయన స్వేచ్ఛావతి అమ్మవారి గుడిలో తెలగ కులస్థులతో కలిసి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. తెలగ కులస్థులకు బీసీల్లో చేర్చాలనే డిమాండ్‌తో జనవరి 28న ఇచ్ఛాపురం నుంచి పాదయాత్ర ప్రారంభించిన పీవీఆర్ ఈనెల 20న పాయకరావుపేటలో పాదయాత్ర ముగించుకొని ఈరోజు ఇచ్ఛాపురం చేరుకున్నారు. మాట్లాడుతూ తెలగ కులస్తులను బీసీలోచేర్చాలనే నినాదంతో చేపట్టిన పాదయాత్రకు సహకరించి విజయవంతం చేసినా అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీను, పల్లంటి చిరంజీవి,రాంబాబు, అరుణ్ తదితరులుపాల్గొన్నారు.